## విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించాలి

- డీఈఓ ప్రశాంత్‌రెడ్డి

మైలారంతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల గణితం అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకుంటున్న డీఈఓ ప్రశాంత్‌రెడ్డి

బొమ్మలరామారం, ఆగస్టు 8 : విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను నిరంతరం పెంపొందించాలని డీఈఓ ఎన్.ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఫక్కీర్‌గూడ, మేడిపల్లి, మైలారం తండా ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు తీరును, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలను ఏ మేరకు సాధించగలిగారని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్దేశించిన మెనూ పాటించాలని సూచించారు. న్యాస్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధ పరుచాలన్నారు. బోధనలో ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, రాంచంద్రారెడ్డి, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఆర్డీఓ

పట్టణంలోని ఓంకారాశ్రమంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఆర్డీఓ అమరేందర్

భువనగిరి అర్బన్, ఆగస్టు 8 : ప్రతిఒక్కరూ ఇంటి ఆవరణతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ అమరేందర్ అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రగతినగర్‌లో గల ఓంకారాశ్రమంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డుల్లో మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు వహించాలని, లేకుంటే వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రతి ఇంటి ఆవరణ, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. పట్టణంలోని 31, 32వ వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవితానర్సింహాచారి, నాయకులు పి.బాలనర్సింహ, పి.జైపాల్‌రెడ్డి, జె.స్వరాజ్యం, టి.విశ్వేశ్వర్‌రావు, భిక్షపతి, యాదగిరి, రాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## స్వచ్ఛదనంలో ప్రజలు భాగస్వాములు కావాలి

డ్రైనేజీలో ఆయిల్ బాల్స్ వదులుతున్న మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్న మున్సిపల్ వైస్‌పర్సన్ కవిత

మోత్కూరు, ఆగస్టు 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని బృందావన్ వరద నీటి కాల్వలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీడీఎంఏ మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీధర్ పర్యవేక్షణలో ఒకటి, రెండో వార్డుల్లో మురుగు గుంతల్లో దోమల నివారణ మందు స్ప్రే చేశారు. మండలంలోని అనాజీపురంలో జ్వర సర్వే చేశారు. పారిశుధ్యం, పిచ్చి మొక్కలను తొలగించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపలి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య, ఎంపీఓ రావూఫ్ అలీ, కౌన్సిలర్లు, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలి

ఆత్మకూరు(ఎం) ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య పనుల్లో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి రాజారాం, వైద్యాధికారి వంశీకృష్ణ

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 8 : స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, సీహెచ్ఓ కర్ణాకర్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పల్లెపహాడ్‌లో మురుగు గుంతలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న మండల ప్రత్యేకాధికారి సురేశ్

తుర్కపల్లి, ఆగస్టు 8 : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి సురేశ్ అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోతీరాంతండా, పల్లెపహాడ్, గొల్లగూడెం, రామోజీనాయక్‌తండాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురుగు గుంతల్లో అయిల్ బాల్స్ వేయించారు. సీజనల్ వ్యాధుల పట్ల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, డాక్టర్ రాహుల్‌కుమార్ గౌడ్, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వలిగొండ మండలంలో పారిశుధ్య కార్యక్రమాలు

గొల్నేపల్లిలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

వలిగొండ, ఆగస్టు 8 : మండల కేంద్రంతోపాటు వర్కట్‌పల్లి, గొల్నేపల్లి, అరూరు, మొగిలిపాక, రెడ్లరేపాక, ఏదుళ్లగూడెం, దాసిరెడ్డిగూడెం, సుంకిశాల, చిత్తాపురం, సంగెం, దుప్పెల్లి, లింగరాజుపల్లి, జాలుకాల్వ, మాందాపురం తదితర గ్రామాల్లో గురువారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. జ్వర సర్వే నిర్వహించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ, వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# యాదగిరీశుడికి వైభవంగా నిత్యోత్సవాలు

ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు మకర తోరణాన్ని అందజేస్తున్న మనీశ్, అపర్ణ దంపతులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తరనామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకుపైగా నిత్య తిరు కల్యాణతంతు జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.14,10,930 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

### స్వామివారికి బంగారు మకర తోరణం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి హైదరాబాద్ మెహిదీపట్నానికి చెందిన మనీశ్, అపర్ణ దంపతులు రూ.3 లక్షలతో బంగారు తాపడంతో తయారు చేసిన మకర తోరణాన్ని బహూకరించారు. మకర తోరణాన్ని గురువారం ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రయాదంలో వ్యక్తి మృతి

- ముగ్గురికి గాయాలు

యాదగిరిగౌడ్ (ఫైల్)

భువనగిరి అర్బన్, ఆగస్టు 8 : రోడ్డు ప్రయాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన చుక్కల సత్యం బంధువులు హైదరాబాద్‌లో బుధవారం రాత్రి విందు కార్యక్రమం నిర్వహించగా.. ఆరె యాదగిరి, తన మిత్రులు ఆకూనూరి నర్సింగ్‌రావ్, పయ్యావుల శ్రీను, వంటేడు నారాయణరెడ్డితో కలిసి కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్ సమీపంలో కిలోమీటర్ సూచిక బోర్డును కారు అతివేగంగా ఢీకొట్టి పక్కనున్న చెట్టును ఢీకొని గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న ఆరె యాదగిరిగౌడ్ (58) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చుక్కల సత్యం, ఆకూనూరి నర్సింగ్‌రావుకు తీవ్ర గాయాలు కాగా.. హైదరాబాద్‌లోని కామినేని దవాఖానకు తీసుకెళ్లారు. డ్రైవర్ వంటేడు నారాయణరెడ్డి, పయ్యావుల శ్రీను స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతదేహానికి ఏరియా దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ కుమార స్వామి తెలిపారు.

## లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

భువనగిరి అర్బన్, ఆగస్టు 8 : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కె.ఆదర్శ (29) గురువారం వరంగల్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యంలో భువనగిరి పట్టణంలోని ఢాల్ఫిన్ హోటల్ సమీపంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం సర్వీస్ రోడ్డు మార్గం నుంచి బయటకు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆదర్శ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

## కత్తితో బెదిరిస్తున్న వ్యక్తికి రిమాండ్

నిందితుడు నగేశ్

వలిగొండ, ఆగస్టు 8 : కొబ్బరికాయలు నరికే కత్తితో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ద్యానబోయిన నగేశ్ కొబ్బరికాయలు నరికే కత్తి పట్టుకొని బీసీ కాలనీలో రోడ్ల వెంట తిరుగుతూ కాలనీవాసులను అసభ్య పదజాలంతో తిడుతూ బెదిరిస్తున్నాడు. ఎందుకలా చేస్తున్నావని ప్రశ్నించిన కాలనీవాసి బత్తిని అయోధ్యపై హత్యాయత్నం చేశాడు. దాంతో నగేశ్ నుంచి రక్షణ కల్పించాలని అయోధ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గురువారం అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

## ఓపెన్ అడ్మిషన్లు ప్రారంభం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 8 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పోచంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో ఆర్డినేటర్ ఎస్.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసినవారు అడ్మిషన్ తీసుకొని కోర్సు పూర్తి చేయాలని సూచించారు. అడ్మిషన్ల కోసం చదివిన రికార్డ్ షీట్, టీసీ, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోతో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. వివరాలకు పోచంపల్లి ఉన్నత పాఠశాలలో, 8341960246లో సంప్రదించాలని సూచించారు.

## పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి : సీఐటీయూ

గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 8 : గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ గతంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 34 రోజుల సమ్మె కాలానికి వేతనాలు అందివ్వడంతోపాటు పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీపీఐ జిల్లా నాయకుడు ఉప్పల ముత్యాలు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ప్రతికంఠం పూర్ణచందర్‌రాజ్, బీజేపీ మండలాధ్యక్షుడు కాశీనాథ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల కిష్టయ్య, జ్ఞానేశ్వర్, కార్మిక నాయకులు స్వామి, రమేశ్, శ్రీను, సైదులు, నర్సింహ పాల్గొన్నారు.

## మండల కేంద్రాల్లో పంచాయతీ కార్మికుల సమ్మె

బొమ్మలరామారం, ఆగస్టు 8 : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రాల్లో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యాదగిరి, లక్ష్మీపతి, గిరి, మైసయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

బీబీనగర్ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు దీక్ష చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రామిక మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గడ్డం ఈశ్వర్, మండల కార్యదర్శి సిలువేరు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : గ్రామ పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చంద్రకాంత్, వీరస్వామి, సైదులు, భాగ్యమ్మ, సుజాత, వంశీ, గాలయ్య, యాదయ్య, చంద్రయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

రామన్నపేట : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు మాట్లాడారు. నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, నకిరేకంటి రాము, ముత్యాల సాయిలు, సైదులు, ఎల్లయ్య, నర్సింహ, లక్ష్మమ్మ, వసంత, జయమ్మ పాల్గొన్నారు.

వలిగొండ : ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ మండల కన్వీనర్ తుర్కపల్లి సురేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లమయ్య, సాలయ్య, సంతోష, రాములు, నర్సింహ, రామస్వామి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట (మోటకొండూర్) : సఫాయి బంద్ సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా, సమ్మె చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కార్మికుల వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు కేటాయించాలన్నారు. అనంతరం మోటకొండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లూరి ఆంజనేయులు, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మండలాధ్యక్షుడు గోసంగి పరమేశ్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలను నిర్మూలించి యువతను కాపాడాలి : ఎస్ఐ

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ

భువనగిరి అర్బన్, ఆగస్టు 8 : మాదకద్రవ్యాలను నిర్మూలించి యువతరాన్ని కాపాడాలని భువనగిరి పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని శ్రీసాయి రాఘవేంద్ర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడి విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. జీవమంచి పద్ధతులు అలవాటు చేసుకొని ఉన్నత లక్ష్యం కోసం పయనించాలని సూచించారు. మాదకద్రవ్యాలను తీసుకోవడంతో యువత జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన యువత మాదకద్రవ్యాల మత్తులో పడి అర్థాంతరంగా కూలిపోయే పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో యువత మాదకద్రవ్యాలకు బానిసగా మారి ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల అనర్థాలపై గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోదా సంపత్, ఉపాధ్యాయురాలు గీత, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల లావుడియా, రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుకుట్ల శివాని, జిల్లా సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యుడు భవాని శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ చేస్తున్న వేద పండితులు, పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కిరణ్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు 8 : మండలంలోని మొగిలిపాక గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌రెడ్డి ఆర్థిక సహకారంతో గ్రామంలో 21 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో భీమనబోయిన భిక్షపతి, జడిగె భిక్షపతి, జక్కల శంకరయ్య, నరసింహ, విష్ణుచారి, సత్తయ్య, ముత్యాలు, ఎల్లయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

## పల్లెల్లో పచ్చదనం పెంపొందించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : ఇస్కిళ్ల గ్రామంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, ఆగస్టు 8 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పల్లెల్లో పచ్చదనం పెంపొందించాలని, పర్యావరణ సమతుల్యతను కాపాడాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఇస్కిళ్ల గ్రామంలో గురువారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించి భావితరాలకు మేలైన ఆక్సిజన్ అందిచాలన్నారు. పల్లెలను స్వచ్ఛ, హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఇంద్రపాలనగరం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఊరేగింపులో పాల్గొని పూజలు నిర్వహించారు. పచ్చదనం కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ బాలమణి, నాయకులు రాజిరెడ్డి, జగన్మోహన్, ప్రభాకర్, బాలకృష్ణ, నర్సిరెడ్డి, పృథ్వీరాజ్, అక్రం పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడు యాదగిరిగౌడ్ మృతి బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 8 : బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఆరె యాదగిరిగౌడ్ మృతి అత్యంత బాధాకరమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆయన మృతి వార్త తమను, బీఆర్ఎస్ పార్టీ పట్టణ శ్రేణులను కలిచివేసిందని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణం శ్రీరాం నగర్‌లోని ఆయన స్వగృహంలో గురువారం యాదగిరి పార్థివదేహానికి గొంగిడి దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీకి యాదగిరి చేసిన సేవలను కొనియాడారు. బీఆర్ఎస్ ఏర్పాటు నుంచి పార్టీ బలోపేతానికి యాదగిరి ఎంతగానో కృషి చేశారన్నారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని గుండ్లపల్లి శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల నడుమ యాదగిరి అంత్యక్రియలు పూర్తయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు పేర బోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్, పాండవుల భాస్కర్‌గౌడ్, గడ్డం చంద్రం, కోల వెంకటేశ్, చిత్తర్ల బాలయ్య, దండెబోయిన వీరేశం, నర్సింహ నివాళులర్పించారు.

## ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 8 : మండలంలోని కప్రాయపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో చేపట్టనున్న ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ గురువారం పూజలు చేశారు. అనంతరం మండలంలోని పోసానికుంటలో సామ కృష్ణారెడ్డి తల్లి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. కృష్ణారెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు. పూజల్లో బీఆర్ఎస్